"విందులో మంచి స్థలాన్ని వదిలి ఆఖరి స్థలంలో కూర్చోవాలి. లేకపోతే నీ తర్వాత నీకంటే ముఖ్యమైన అతిథి విందుకు వస్తే అప్పుడు విందు ఇచ్చేవాడు నిన్ను వెనక్కి పంపి, ఆ పెద్దమనిషిని అక్కడ కూర్చోమంటాడు. అందరి ముందు నీకు అవమానం కలిగి బాధపడతావు. ఆఖరున కూర్చున్న నిన్ను చూసి నీ మిత్రుడు 'ఇక్కడ కూర్చున్నావేమిటి? రా' అని నిన్ను అంతకన్నా మంచి స్థలానికి తీసుకెళ్తే, నువ్వు ఆదరింపబడటం అంతా చూస్తారు. నిన్ను నువ్వు గొప్పగా చేసుకుంటే, దేవుడు నిన్ను తక్కువ చేస్తాడు. నిన్ను నువ్వు తక్కువ చేసుకుంటే, దేవుడు నిన్ను గొప్పగా చేస్తాడు."

## 50. జాతకం

ఓ గ్రామంలో ఓ సాధువు ఓ పాడుబడ్డ గుళ్ళో ఉంటూ చాలాకాలంగా సాధన చేస్తున్నాడు. కష్టాల్లో ఉన్నవారు అతని దగ్గరకి వెళ్ళి తమ కష్టాలని తొలగించమని వేడుకునేవారు. ఆ సాధువు వాళ్ళ జాతకాలని పరిశీలించి, ఏం పరిహారం చేస్తే వాళ్ళకా కష్టాలు తొలగుతాయో చెప్పేవాడు. ఒకోసారి ఆ సాధువు భగవంతుడ్ని సలహా కోరితే కలలో అతను ఉపాసించే దైవం కనపడి ఏదైనా సలహాని కూడా సూచించేవాడు.

ఓ సారి ఓ ముత్తయిదువ ఆ సాధువు దగ్గరకి వెళ్ళి వేడుకుంది.

"స్వామీ! నాకు పెళ్ళయి ఇరవై ఏళ్ళయినా ఇంతదాకా సంతాన యోగ్యత లేదు. దయచేసి నాకు సంతానం కలిగే ఉపాయం చెప్పండి."

అతను ఆవిడ జాతకాన్ని పరిశీలించి చూసి చెప్పాడు.

"నీకు ఈ జన్మకి సంతాన భాగ్యం కలిగే యోగ్యత లేదు."

ఆవిడ విచలిత మనస్కురాలై ఏడుస్తూ అడవిలో వెళ్తూంటే ఓ యోగి ఆవిడని చూసి అడిగాడు.

"దేనికలా బాధపడుతున్నావు?"

"నాది గొడ్రాలి బతుకు కాబట్టి ఆత్మహత్య చేసుకోవాలనుకుని వెళ్తున్నాను."

ఆవిడ జరిగింది అతనికి చెప్పింది.

"ఏడవక. ఇంటికి వెళ్ళు. నీకు నలుగురు సంతానం కలుగుతారు." ఆ యోగి చెప్పాడు.

దాంతో ఆనందంగా ఆవిడ ఇంటికి వెళ్ళిపోయింది. ఆవిడకి నలుగురు పిల్లలు పుట్టారని మొదటి సాధువుకి తెలిసి ఆశ్చర్యపోయాడు. ఆవిడని పిలిచి ఆ నలుగురు నిజంగా ఆవిడకి పుట్టిన సంతానమేననీ, దత్తత తీసుకోలేదని నిశ్చయం చేసుకున్నాక మరోసారి ఆమె జాతకాన్ని పరిశీలించాడు. ఆ రాత్రి తను ఉపాసించే దేవుడ్ని కలలో కనపడమని ప్రార్థించి పడుకున్నాడు. ఎప్పటిలా దేవుడు స్వప్న దర్శనం ఇచ్చాడు.

"ఇదేమిటి స్వామి! ఆ ముత్తయిదువకి ఈ జన్మకి సంతాన ప్రాప్తి లేదని ఆవిడ జాతకంలో వుంది కదా? మరి మీ మాటలు వ్యర్థమై ఆవిడకి నలుగురు సంతానం ఎలా పుట్టారు?" అడిగాడు సాధువు.

"నా భక్తుడు ఒకడు ఆవిడ జాతకం చూడకుండానే ఆవిడకి నలుగురు పిల్లలు పుడతారని ఆశీర్వదించి పంపాడు. ఏ దేవుడైనా భక్తుడికి దాసుడే కదా. అందుచేత ఆవిడకి అతని మాట ప్రకారం నలుగురు పిల్లలని నేను ఇవ్వక తప్పింది కాదు." వివరించాడు దేవుడు.

## 51. తృప్తి గలవాడు ఎవడు?

ఓ తాత్త్వికుడు తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ నివేశన స్థలంలో ఈ బోర్డుని ఉంచాడు.

'తమ జీవితంలో అన్ని విధాలా తృప్తి చెందిన వారికి ఈ స్థలం ఉచితంగా ఇవ్వబడుతుంది.'

ఆ దారిన వెళ్ళే ఓ ధనవంతుడు ఆ బోర్డుని చదివి ఆ తాత్త్వికుడి ఇంటి దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"నేను అన్నిటా తృప్తి పడిన వాడిని. నా కోరికలన్నీ తీర్చుకోడానికి సరిపడే డబ్బు నాకు ఉండటం వల్ల అది సాధ్యం అయింది. కాబట్టి ఆ స్థలానికి నేను అర్హుడ్ని అనుకుని మీ దగ్గరకి వచ్చాను."